సాక్షి
విశాఖపట్నం
శనివారం । 1 । ఫిబ్రవరి । 2025


పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అవసరం 8లో


రేపు ఒడిశాకు అప్పన్న ప్రచార రథం 8లో


పరీక్షా కాలం 8లో

వాల్తేరులో ఆగేనా?

బడ్జెట్ రైలుబండి..



వాల్తేరు డివిజన్‌లో ఏటా బడ్జెట్ బండి కోసం ఎదురు చూపులు తప్పడం లేదు. గంపెడు నిధులతో పరుగులు పెడుతూ వస్తున్నట్లు కనిపించినా..విత్త మంత్రి ప్రసంగం ముగిసిన తర్వాత చూస్తే.. రైలు వచ్చినట్లే వచ్చి బైపాస్‌లో మాయమైపోతోంది. దశాబ్దకాలంగా అరకొర నిధుల విదిలింపులతో వాల్తేరు పరిధిలో ప్రాజెక్టులు సా...గుతూనే ఉన్నాయి. ఉత్తరాంధ్ర వాసుల చిరకాల స్వప్నం దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన జరిగినా ఎలాంటి కదలిక లేకపోవడంతో మళ్లీ కథ మొదటికొచ్చింది. ఈసారైనా బడ్జెట్‌లో సంపూర్ణంగా నిధులు కేటాయింపులు చేస్తారని ఆశగా ఎదురు చూస్తున్నారు.

- సాక్షి, విశాఖపట్నం

- ఏటా బడ్జెట్‌లో వాల్తేరుకు అరకొర నిధులు
- ప్రాజెక్టులు మంజూరు చేసినా నిధుల విషయంలో మీనమేషాలు
- ఆగిపోయిన అనేక రైల్వే ప్రాజెక్టులు
- జోన్‌కు శంకుస్థాపన జరిగి 20 రోజులు దాటినా పడని అడుగు
- వాల్తేరు డివిజన్ కొనసాగింపుపై గంపెడాశలు పెట్టుకున్న ఉద్యోగులు
- నేటి బడ్జెట్‌పై కోటి ఆశలు పెట్టుకున్న వాల్తేరు వాసులు

ప్రతిపాదనలు ఇచ్చారా ఎంపీ సారూ..?

ప్రతి బడ్జెట్‌కు ముందు.. ఆయా ఎంపీలు తమ పరిధిలో చేపట్టాల్సిన ప్రాజెక్టులు, కొత్త రైళ్ల మంజూరు మొదలైన ప్రతిపాదనలను రైల్వే మంత్రిత్వ శాఖకు అందిస్తారు. వాటిని సాధించేందుకు నిరంతరం రైల్వే బోర్డు అధికారులతో సంప్రదింపులు చేస్తారు. ఈసారి కూడా కూటమి ఎంపీలు ఒక్క ప్రతిపాదన కూడా రైల్వే మంత్రికి అందించలేదని తెలుస్తోంది. బడ్జెట్ సమయంలో మంజూరు కాకపోతే కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కడం అసాధ్యమని తెలిసినా.. కూటమి ప్రభుత్వ ఎంపీల్లో ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం.

'జోన్' కథ కొనసాగుతోందంతే.!

డీపీఆర్ అందించిన నాలుగేళ్ల తర్వాత జోన్ నిర్మాణానికి రూ.9 కోట్లు కేటాయించారంటే.. ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంట్‌పై కేంద్రానికి ఏపాటి చిత్తశుద్ధి ఉందో స్పష్టమవుతోంది. ఓవైపు ప్రధాని మోదీ వచ్చి.. అట్టహాసంగా విశాఖ కేంద్రంగా దక్షిణ కోస్తా రైల్వే జోన్‌కు శంకుస్థాపన కూడా చేసేశారు. మరోవైపు జోన్ ప్రధాన కార్యాలయం నిర్మాణానికి రూ.149.16 కోట్లతో గతేడాది నవంబర్ 23న టెండర్లు కూడా పిలిచారు. అయితే ఈ టెండర్ల ప్రక్రియ గడువు ముగిసి నెల రోజులు గడుస్తున్నా దానిపై ఏ మాత్రం సమాచారం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా పూర్తిస్థాయి నిధులు విడుదల చేస్తే తప్ప.. జోన్ కార్యాలయ నిర్మాణానికి అడుగులు పడే సూచనలు కనిపించడం లేదు.

స్టేషన్లలో సమస్యల సవారీ..


ప్లాట్‌ఫామ్‌పైనే నిద్రిస్తున్న ప్రయాణికులు

వాల్తేరు పరిధిలో 100 శాతం ఎలక్ట్రిఫికేషన్ పూర్తి చేశామని గొప్పలు చెప్పుకుంటున్న రైల్వే అధికారులు.. ప్రయాణికుల మౌలిక సదుపాయాలపై మాత్రం పూర్తిస్థాయిలో దృష్టి సారించలేకపోతున్నారు. రద్దీ పెరిగితే చాలు ప్రయాణికుల యాతన అంతా ఇంతా కాదు. ప్లాట్‌ఫారాలపైనే పడిగాపులు కాయాల్సిన దుస్థితి ఇంకా ఇక్కడ కొనసాగుతోంది. మర్రిపాలెం రైల్వే స్టేషన్‌లో చీకటి పడితే చాలు ఏ రైలు వస్తుందో తాము ఎక్కడ ఉన్నామో కూడా అర్థం కాని దుస్థితి దాపురించింది. దువ్వాడలో దారుణమైన పరిస్థితులున్నాయి.

వాల్తేరు బంధంపై సందిగ్ధత వీడేనా.?

తూర్పు కోస్తా రైల్వే జోన్‌కు వాల్తేరు డివిజన్ బంగారు బాతుగుడ్డు లాంటి ఆదాయాన్ని తెచ్చిపెట్టే అతిపెద్ద డివిజన్ వాల్తేరు. జోన్‌కు ఏటా దాదాపు రూ. 15 వేల కోట్లు ఆదాయం కాగా, ఇందులో రూ.8 వేల కోట్లు వరకూ వాల్తేరు డివిజన్ నుంచే వస్తోంది. ఇప్పుడు ఇదంతా దాదాపు రాయగడ డివిజన్‌కు సొంతమవుతుంది. మనకు రావాల్సిన ఆదాయం దాదాపు సింహభాగం కోల్పోయినట్లే అవుతుంది. ఈ నేపథ్యంలో వాల్తేరు కొనసాగించాలంటూ రైల్వే ఉద్యోగులే ఉద్యమ బాట పట్టారు. డివిజన్ విడిపోతే 80 శాతం మంది ఉద్యోగులు ఇతర రాష్ట్రంపరిధిలోకి వెళ్లిపోతారు. అందుకే విశాఖ నుంచి పలాస వరకూ 200 కిమీ, కోనేరు వరకూ 160 కిమీ, అరకు వరకూ 130 కిమీ, విశాఖ నుంచి కాకినాడ, సామర్లకోట జంక్షన్, ద్వారపూడి వరకూ 180 కిమీ వరకూ వాల్తేరు డివిజన్ ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గాలికొదిలేసిన స్టేషన్ రీ డెవలప్‌మెంట్



విశాఖ రైల్వే స్టేషన్‌కి మరిన్ని హంగులద్దేలా రైల్వే స్టేషన్ మోడ్రనైజేషన్ రైల్ ల్యాండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జరుగుతోంది. స్టేషన్‌లో అత్యాధునిక సౌకర్యాలు కల్పించేందుకు ఇంజినీరింగ్ ప్రొక్యూర్‌మెంట్ కన్‌స్ట్రక్షన్ (ఈపీసీ) మోడల్‌లో పునరాభివృద్ధి చేసేందుకు రూ.446.41 కోట్లతో పనులు చేపట్టారు. 2022లో పనులు మొదలయ్యాయి. ఇప్పటికీ పునాది దశ దాటకపోవడంపై ప్రయాణికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

వాల్తేరు డివిజన్‌ను కొనసాగించాల్సిందే



శనివారం ప్రవేశపెట్టబోయే కేంద్ర బడ్జెట్ ఉత్తరాంధ్రలో ఏర్పాటు చేయబోతున్న రైల్వే జోన్ తో పాటుగా విశాఖపట్నం డివిజన్ కొనసాగిస్తూ రైల్వే రిక్రూట్మెంట్ బోర్డ్, రైల్వే రిక్రూట్మెంట్ సెల్ వంటి అన్ని సదుపాయాలతో కూడిన జోన్ కు నిధులు కేటాయించాలని కోరుతున్నాం. విశాఖ డివిజన్ కొనసాగించడానికి అందుబాటులో అనేక అవకాశాలుఉన్నాయి. అరకు, పలాస, నుంచి ద్వారపూడి వరకూ వాల్తేరు డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్‌పై రైల్వే ఉన్నతాధికారులు రాజకీయ ప్రతినిధులు పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నాం.

–డా.పెదిరెడ్ల రాజశేఖర్, సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు

ప్రాజెక్టులకు నిధులు కావాలి



వాల్తేరు డివిజన్‌తో పాటు ఈస్ట్‌కోస్ట్ రైల్వే జోన్ పరిధిలోని ప్రాజెక్టులు దాదాపు పెండింగ్‌లోనే ఉండిపోయాయి. వీటన్నింటికీ నిధులు మంజూరు చెయ్యాలి. అదేవిధంగా.. చిన్న స్టేషన్ల ప్రయాణికులకు అనుసంధానం చేస్తూ మెమూ రైళ్లు నడపాలి. వైజాగ్ నుంచి కీలకమైన నగరాలకు స్పెషల్ ట్రిన్లు కాకుండా.. పర్మినెంట్ రైళ్లు కొనసాగించాలి. రైల్వేపై భారం అనే సాకుతో 2019లో వృద్ధులకు రాయితీని తొలగించారు. రాయితీల్ని పునరుద్ధరించాలి.

– కంచుమర్తి ఈశ్వర్, జెడ్ఆర్‌యూసీసీ మెంబర్

ప్రజలు కోరుకుంటున్నవేంటంటే...



- విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ప్లాట్‌ఫారాల విస్తరణ ఎంతో అవసరం. అదనపు ప్లాట్‌ఫారాలు లేకపోవడంతో ఔటర్‌లో గంటల తరబడి రైళ్లు నిలిచిపోతున్నాయి.
- రూ.76 కోట్లతో మర్రిపాలెం స్టేషన్ అభివృద్ధి పనులు ఐదేళ్ల క్రితం నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. గోపాలపట్నం– మర్రిపాలెం మధ్య రెండు ప్రధాన లైన్లతో పాటు లూప్‌లైన్లు ఏర్పాటు కానున్నాయి. ఇవి ఏర్పాటైతే వైజాగ్ స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా మర్రిపాలెం అభివృద్ధి చెందుతుంది. కానీ నిధుల మంజూరు విషయంలో జాప్యం జరుగుతుండటంతో ఈ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇవి పూర్తయితే వైజాగ్‌కు రాకుండా దువ్వాడ నుంచి బైపాస్ మీదుగా వెళ్లిపోతున్న 15 వరకూ రైళ్లు.. ఇక్కడికి వచ్చే అవకాశాలున్నాయి.
- రూ.159.47 కోట్లతో విశాఖ–గోపాలపట్నం మధ్య 15.31 కిమీ మేర 3వ, 4వ లైన్లు నిర్మాణ పనులు పూర్తి కావాలి. వాస్తవానికి ఈ ప్రాజెక్టు డీపీఆర్ ఇచ్చి ఐదేళ్లు గడిచినా పనులు కాంట్రాక్టు సంస్థకు అప్పగించే పనిలోనే కాలం గడిచిపోతోంది.
- దువ్వాడ నుంచి ఉత్తర సింహాచలం వరకూ 20.54 కిమీ మేర రూ.92.62 కోట్లతో లైను అభివృద్ధి ప్రాజెక్టు మంజూరైనా.. ఇప్పటి వరకూ కేవలం రూ.8 కోట్లు మాత్రమే ఇచ్చారు. దీంతో రెండేళ్లలో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు మరో రెండేళ్లు పట్టే సూచనలు కనిపిస్తున్నాయి.

జ్ఞానాపురం వైపు అభివృద్ధి చేస్తే వైజాగ్‌కు మహర్దశ



జ్ఞానాపురం వైపు వాల్తేరు రైల్వే డివిజన్‌కు సుమారు 60 ఎకరాల వరకూ భూములున్నాయి. కనీసం నాలుగు కొత్త ప్లాట్‌ఫారాలు నిర్మిస్తే.. విశాఖపట్నం రైల్వే స్టేషన్ మరింత అభివృద్ధి చెందుతుంది. ఇందులో 10 ఎకరాల వరకూ కమర్షియల్‌గా అభివృద్ధి చేస్తే.. రైల్వేస్టేషన్ ఆదాయం గణనీయంగా పెరగడంతో పాటు రాకపోకలకు కూడా అనువుగా మారుతుంది. రీడెవలప్‌మెంట్ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చెయ్యాలి.

– డేనియల్ జోసెఫ్, వైజాగ్ స్టేషన్ కన్సల్టేటివ్ కమిటీ మెంబర్

న్యూస్‌రీల్

అభివృద్ధికి అవకాశమున్న రంగాలపై సమీక్ష


మాట్లాడుతున్న సుబ్రహ్మణ్యం

విశాఖ సిటీ: జిల్లాలో వనరులు, అభివృద్ధికి అవకాశం ఉన్న వివిధ రంగాలపై జిల్లా అధికారులతో నీతి ఆయోగ్ సభ్యులు సమీక్షించారు. శుక్రవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నీతి ఆయోగ్ ప్రధాన ప్రగతి చోదకాలైన ఆక్వా, ఔషధ, ఉక్కు, పెట్రోకెమికల్ రంగాలపై సమావేశం నిర్వహించారు. నీతి ఆయోగ్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుబ్రహ్మణ్యం, సభ్యులు ఎస్.కిశోర్, కలెక్టర్ హరేందిరప్రసాద్, ఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీరాజ్, జీసీసీ ఎండీ కల్పనాకుమారి, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, ఈఎస్ఐజీ తరఫున శిరీష్‌కాంకే పాల్గొని పలు అంశాలపై చర్చించారు. ప్రధానంగా జిల్లాలో వనరులు, అభివృద్ధికి అవకాశం ఉన్న రంగాలపై విస్తృతంగా చర్చించారు. వీఎంఆర్‌డీఏ జాయింట్ కమిషనర్ రమేష్, సీయూపీ శిల్ప పాల్గొన్నారు.

జీవీఎంసీ ప్రణాళికాధికారులపై ఆరోపణలు..వివరణకు ఆదేశం

అల్లిపురం: జీవీఎంసీ, జోన్–8 పరిధిలో అక్రమ నిర్మాణాలు ప్రోత్సహిస్తున్నారంటూ అవినీతి నిరోధక శాఖ ఇచ్చిన నివేదిక మేరకు 24 మంది అధికారులు, సిబ్బందిపై ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై వారిని వివరణ కోరుతూ మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధిశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. గత ఏడాది నవంబర్ 3, 4 తేదీలలో అవినీతి నిరోధక శాఖ ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. జోన్ పరిధిలో అనధికారిక నిర్మాణాలను అనుమతించినట్లు గుర్తించింది. అప్పటి ఉప ప్రణాళికాధికారులు రాంబాబు, కె.పద్మజ, సహాయ ప్రణాళికాధికారులు కేవీ భాస్కర్‌బాబు, పి.మధుకుమార్, కృష్ణారావు, వెంకటేశ్వరరావు, రమణమూర్తి, శాస్త్రి, షబ్నమ్, జయరాం, (ఇన్‌చార్జ్ ఏసీపీ) ఎస్.వెంకటేశ్వరరావు, టీపీఓలు ఎం.తిరుపతిరావు, సీహెచ్ రఘునాథరావు, సీఎస్ ప్రవీణ్‌కుమార్, యు.రామకృష్ణ, డి.తేజేశ్వరరావు, విజయకుమార్, పి.ప్రమీలారాణి, ఎస్.లక్ష్మీజ్యోతి, టీడీబీవో చెట్టి అనిత, డబ్ల్యూపీఆర్‌ఎస్‌లు బి.రవితేజ, రెడ్డి అరుణ, స్వప్న, సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి,అప్పలనాయుడులపై అభియోగాలు నమోదు చేశారు. వారిచ్చే సమాధానానికి అనుగుణంగా చర్యలు తీసుకోనున్నారు.

నేటి నుంచి బాదుడే

- 15 నుంచి 131 శాతం భూముల విలువ పెంపు
- భారం కానున్న రిజిస్ట్రేషన్ చార్జీలు
- చివరి రోజు శుక్రవారం రెట్టింపు స్థాయిలో రిజిస్ట్రేషన్లు
- రాత్రి 10 దాటినా పనిచేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు
- కొనిసార్లు మొరాయించిన సర్వర్


సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న క్రయ విక్రయదారులు

విశాఖ సిటీ: విశాఖలో భూముల విలువ శనివారం నుంచి గణనీయంగా పెరగనుంది. మునుపెన్నడూ లేని విధంగా 15 శాతం నుంచి 131 శాతం వరకు భూముల విలువలను సవరించారు. దీంతో ప్లాట్లు, ప్లాట్లతో పాటు వ్యవసాయ భూములు కొనుగోలు చేసే వారిపై రిజిస్ట్రేషన్ చార్జీల భారం భారీగా పడనుంది. ఈ పెరిగిన ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. అధికారంలోకి వస్తే ఏ చార్జీలు పెంచబోమని అబద్ధపు హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వరుసగా ప్రజలపై భారాలు మోపుతూపోతోంది. రెండు నెలల క్రితమే విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలకు షాక్ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రిజిస్ట్రేషన్ చార్జీలను సైతం పెంచింది. ఇప్పటికే విశాఖలో భూములు ధరలు గరిష్ట స్థాయిలో ఉన్నాయి. శివారు ప్రాంతాల్లో సైతం గజం ధర రూ.30, రూ.40 వేలుగా ఉంది. ఇటువంటి తరుణంలో రిజిస్ట్రేషన్ చార్జీలు కూడా భారీగా పెరగడంతో మధ్య తరగతి ప్రజలు సొంతింటిని కొనుగోలు చేయడం కష్టసాధ్యంగా మారనుంది. విశాఖలో భూముల విలువ సవరణల ద్వారా రూ.150 కోట్ల మేర ఆదాయం సమకూరుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

కిక్కిరిసిన కార్యాలయాలు

పెరిగిన రిజిస్ట్రేషన్ ధరలు శనివారం నుంచి అమలులోకి రానున్నాయి. 1వ తేదీ నుంచి అత్యల్పంగా 15 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరగడంతో చివరి రోజు శుక్రవారమే చాలా మంది కొనుగోలుదారులు రిజిస్ట్రేషన్ల కోసం ఎగబడ్డారు. దీంతో అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. సాధారణ రోజుల్లో ఒక్కో కార్యాలయంలో 30 నుంచి 40 రిజిస్ట్రేషన్లు జరిగేవి. కానీ భూముల విలువ పెరగడంతో చివరి రెండు రోజులు రోజుకు 60 నుంచి 70 రిజిస్ట్రేషన్లు జరిగాయి. శుక్రవారం కూడా అదే స్థాయిలో క్రయ, విక్రయదారులతో కార్యాలయాలు కిక్కిరిసిపోయాయి. రాత్రి 10 గంటల తరువాత కూడా రిజిస్ట్రేషన్ కార్యకలాపాలు జరగడం విశేషం.

'చలి'ఫన్‌డుగ



పర్యాటకుల సెల్ఫీ టైం
పద్మాపురంలో హాట్ ఎయిర్ బెలూన్

- గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అరకు చలి ఉత్సవ్
- సందడిగా 5కే మారథాన్
- పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో
- ప్రత్యేక ఆకర్షణగా హెలికాప్టర్ రైడింగ్
- గిరిజన నృత్యాలకు జనం ఫిదా
- నోరూరించిన చిరు ధాన్యాలతో వంటకాలు
- తొలి రోజు 5 వేల మంది హాజరు
- ఫిబ్రవరి 2వరకు ఉత్సవాలు


కొమ్ము డాన్స్‌తో అలరిస్తున్న కళాకారులు


సాంస్కృతిక కార్యక్రమాలు


కూరగాయలతో తయారు చేసిన నమూనాలు

గణబాబుకు అడ్డగోలు నజరానా

- వేపగుంటలో మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతిస్తూ ఉత్తర్వులు
- ఆ స్థలంలో వివాదాలు ఉండడంతో 2019లో అనుమతి నిరాకరణ

పెందుర్తి: వడ్డించే వాడు మనవాడైతే బంతి ఆఖర్లో కూర్చున్నా ఇబ్బంది లేదన్నది నానుడి. కూటమి ప్రభుత్వంలో క్షేత్రస్థాయిలో అర్హత ఉన్నా లేకపోయినా అయినవారికి నజరానాలు ఇవ్వడంలో ఎలాంటి జాప్యం ఉండదు. ఈ క్రమంలోనే దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న మల్టీప్లెక్స్ సినిమా థియేటర్, షాపింగ్ మాల్, వాణిజ్య సముదాయంతో కూడిన ఫంక్షన్ హాల్ నిర్మాణానికి పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, ప్రభుత్వ చీఫ్ విప్ పి.జి.వి.ఆర్ నాయుడు (గణబాబు)కు అనుమతి ఇస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి సిసోడియా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వేపగుంట సర్వే నంబర్ 76/3లో 4465 చదరపు మీటర్లలో ఆయా నిర్మాణాల చేపట్టేందుకు అనుమతి ఇస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా ఆయా నిర్మాణాలకు అనుమతి కోరుతూ 2019లోనే గణబాబు దరఖాస్తు చేసుకున్నారు. అయితే స్థానిక పరిస్థితులు, ఇతరత్రా అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు.

ఆగమేఘాల మీద అనుమతి

వేపగుంట సర్వే నెంబర్ 76/3లో మల్టీప్లెక్స్ నిర్మాణం కోసం 2019 నవంబర్‌లో గణబాబు దరఖాస్తు చేసుకున్నారు. అయితే స్థానికంగా స్థలంలో వివాదాలు ఉండడం, ఇతర సమస్యలపై సమీక్షించిన అధికారులు అప్పట్లో మల్టీప్లెక్స్ నిర్మాణం కోసం అనుమతిని నిరాకరించారు. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక అదే ప్రభుత్వంలో చీఫ్ విప్‌గా ఉన్న గణబాబు 2024 డిసెంబర్ 23న మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. అయితే దీనిపై క్షేత్రస్థాయిలో విచారణ చేయకుండా, గత రికార్డులను పరిశీలించకుండా కేవలం నెలన్నరలో ఆగమేఘాల మీద భారీ నిర్మాణాలకు అనుమతి ఇవ్వడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

బెల్టు షాపులను నియంత్రించాలి

ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్

విశాఖ సిటీ: ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఎక్కడా బెల్టు షాపులు కనిపించకుండా చర్యలు తీసుకోవాలని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డైరెక్టర్ నిషాంత్‌కుమార్ ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఏయూలో ఉత్తరాంధ్ర జిల్లాల ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో బెల్టు షాపుల లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందని చెప్పారు. అలాగే ఎంఆర్‌పీకే మద్యం విక్రయాలు జరగాలని స్పష్టం చేశారు. గంజాయి, మత్తు పదార్థాల నియంత్రణపై కూడా దృష్టి పెట్టాలన్నారు. అనంతరం ఏయూలో మద్యం నాణ్యతను తనిఖీ చేసే లేబొరేటరీని సందర్శించారు.

సజావుగా ఇంటర్ పరీక్షలు

ఏర్పాట్లపై కలెక్టర్ హరేందిర ప్రసాద్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: జిల్లాలో మార్చి ఒకటో నుంచి జరగనున్న ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో పరీక్షల నిర్వహణపై సమన్వయ సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 1 నుంచి 20 వరకు జరగనున్న ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరపు పబ్లిక్ థియరీ, ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహణలో ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. థియరీ పరీక్షలు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగనున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణలో భాగంగా సమన్వయంతో పనిచేసి పరీక్షల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను, ముందస్తు ప్రణాళిక చర్యలు తీసుకోవాలని తెలిపారు. సమావేశంలో ఆర్ఐవో పి.మురళీధర్, డీవీఈవో బి.రాధ, పోలీస్, జీవీఎంసీ, వైద్యఆరోగ్య శాఖ, ఆర్టీసీ, విద్యుత్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కుంభమేళాకు ప్రత్యేక రైలు

తాటిచెట్లపాలెం: మహా కుంభమేళా ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖపట్నం నుంచి గోరఖ్‌పూర్‌కు ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. విశాఖపట్నం–గోరఖ్‌పూర్(08588) స్పెషల్ రైలు ఈ నెల 4న విశాఖపట్నంలో రాత్రి 10.20 గంటలకు బయలుదేరుతుంది. గురువారం రాత్రి 7.30 గంటలకు గోరఖ్‌పూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో గోరఖ్‌పూర్–విశాఖపట్నం(08587) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5.45 గంటలకు బయలుదేరి, ఆదివారం మధ్యాహ్నం 3.55 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

విజయనగరం వరకే పార్వతీపురం పాసింజర్: సాంకేతిక కారణాల దృష్ట్యా శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు విశాఖపట్నం–పార్వతీపురం(67287) పాసింజర్ విజయనగరం వరకు మాత్రమే నడుస్తుంది. పార్వతీపురం–విశాఖపట్నం(67288) పాసింజర్ విజయనగరం నుంచి బయలుదేరుతుంది. ఈ తేదీల్లో విజయనగరం–పార్వతీపురం మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు.

శ్రీకాకుళం వరకే పలాస పాసింజర్ : విశాఖపట్నం–పలాస(67289) పాసింజర్ శనివారం నుంచి ఈ నెల 28వ తేదీ వరకు శ్రీకాకుళం రోడ్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుంది. పలాస–విశాఖపట్నం(67290) పాసింజర్ శ్రీకాకుళం నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ తేదీల్లో పలాస– శ్రీకాకుళం రోడ్ మధ్య ఈ రైళ్లు రాకపోకలు సాగించవు. ప్రయాణికులు ఈ మార్పులను గమనించాలని కోరారు.

బొకారో ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు : సదరన్ రైల్వే సేలం డివిజన్ పరిధిలో జరుగుతున్న పనుల కారణంగా అలపుజ–ధన్‌బాద్(13352) బొకారో ఎక్స్‌ప్రెస్ ఫిబ్రవరి 2, 4, 6, 18, 25వ తేదీల్లో దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఆయా తేదీల్లో ఈ రైలు వయా పోదనూర్–ధన్‌బాద్ మీదుగా నడుస్తుంది.

ఐస్టా బాలబాలికల టెన్నిస్ టోర్నీ ప్రారంభం


టెన్నిస్ ఆడుతున్న మాజీ డీజీపీ సాంబశివరావు

విశాఖ స్పోర్ట్స్: ఆల్ ఇండియా సీనియర్ టెన్నిస్ సంఘం (ఐస్టా) ఆధ్వర్యంలో బాలబాలికల టెన్నిస్ టోర్నీ శుక్రవారం ప్రారంభమైంది. వెటరన్స్‌లో ర్యాంకింగ్ టోర్నీతో పాటు చిన్నారులకు అనుబంధంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఏయూ టెన్నిస్ కోర్ట్స్‌లో ఈ పోటీలను మాజీ డీజీపీ సాంబశివరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు క్రీడల పట్ల అవగాహన కల్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. టోర్నీ నిర్వాహకుడు కృష్ణంరాజు మాట్లాడుతూ అండర్–12, 14 కేటగిరీల్లో బాలబాలికలకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా.. ఆఫీసర్స్ క్లబ్‌తో పాటు స్థానిక క్లబ్స్‌లో 35+ నుంచి 70+ వరకు వెటరన్స్‌కు నిర్వహిస్తున్న సింగిల్స్, డబుల్స్ పోటీలు సెమీస్ దశకు చేరుకున్నాయి. శుక్రవారం 45+లో జరిగిన మ్యాచ్‌లో పి.ఎస్.రాజు 2–6, 7–6, 10–5తో సూపర్ టైబ్రేక్‌లో పి.ఎన్.మూర్తిపై విజయం సాధించారు. 35+లో విజయ్ ఆనంద్ 6–1, 6–2తో నగేష్‌పై గెలుపొందారు. కార్యక్రమంలో టోర్నీ డైరెక్టర్ సతీష్, ఉపాధ్యక్షుడు ప్రేమ్‌చంద్, కార్యదర్శి డీఎస్ఎన్ రాజు, కోచ్ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల కందిపప్పు పంపిణీ లేనట్లే?

మహారాణిపేట: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి 8 నెలలు గడుస్తున్నా, పేద ప్రజలకు రేషన్ దుకాణాల ద్వారా పూర్తిస్థాయిలో నిత్యావసర సరుకులు అందించడం లేదు. ఎన్నికల ముందు అనేక హామీలు గుప్పించిన ప్రభుత్వం, అధికారంలోకి వచ్చాక మాత్రం ఆ హామీని విస్మరించింది. ఇప్పటివరకు అరకొరగానే సరకులు సరఫరా చేసింది. ఫిబ్రవరికి సంబంధించి బియ్యం, పంచదార మాత్రమే గోదాములు దాటాయి. ఈ నెల కందిపప్పు అందే అవకాశం లేదని తెలుస్తోంది. కందిపప్పు గోదాముల్లోనే ఉండిపోయింది. డీలర్లు తీసుకెళ్లలేదు. బయట మార్కెట్‌లో కందిపప్పు కొనుగోలు చేసుకోలేని పరిస్థితి. ఎప్పుడూ లేని విధంగా కంది పప్పు ధర ఉంది. ఇటు బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేయలేక, అటు ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో పేద, మధ్య తరగతి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. కందిపప్పు సరఫరా గురించి అధికారులు కూడా స్పష్టమైన సమాచారం ఇవ్వడం లేదు. ఇక రాగి పిండికి ఇండెంట్ లేదు. వంటనూనె ఊసేలేదు. ప్రస్తుతం అర్బన్ డీఎస్‌వో పరిధిలో మధురవాడ, ఆనందపురం, భీమిలి, పద్మనాభం, పెందుర్తి తదితర ప్రాంతాలు ఉన్నాయి. జిల్లాలో 5,12,619 కార్డుదారులు ఉన్నారు.

చలి ఫన్‌డుగ

- గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా అరకు చలి ఉత్సవ్
- 5కె రన్ మారథాన్ పోటీలతో ప్రారంభం
- ఈ నెల 2 వరకు కొనసాగనున్న కార్యక్రమాలు

ఆరంభం అదిరింది.. మూడు రోజుల పాటు జరిగే అరకు చలి ఉత్సవ్ 2025 శుక్రవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉత్సవ్‌ను కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. థింసా నృత్యాలు, డప్పు వాయిద్యాలతో అరకు హోరెత్తింది. పారా గ్లైడింగ్, ఎయిర్ బెలూన్, హెలికాప్టర్ రైడింగ్, పద్మాపురం గార్డెన్‌లో ఫ్లవర్ షో, డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన స్టాళ్లు, ఆదివాసీల వంటకాల ఫుడ్ ఫెస్ట్, వివిధ రాష్ట్రాల గిరిజన కళాకారుల నృత్య ప్రదర్శనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


ఉత్సవాలు ప్రారంభిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్


డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్ట్‌లో గిరిజన వంటకాలతో మహిళలు

సాక్షి, విశాఖపట్నం: ఆంధ్రా ఊటీ అరకులోయలో చలి ఉత్సవ్ ఆరంభం అదిరింది. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా 'అరకు చలి ఉత్సవ్' శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఉదయం 7.30 గంటలకు 5కె రన్ మారథాన్ పోటీలతో కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ ఉత్సవ్‌ను ప్రారంభించారు. అరకులోయ రవ్వలగూడ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగిన 5కె రన్ మారథాన్‌లో పర్యాటకులు, స్థానిక గిరిజన యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. సాయంత్రం 6 గంటల నుంచి ప్రదర్శించిన సంప్రదాయ గిరిజన నృత్యాలైన థింసా, నగరభేరి, కూచిపూడి, జముకు పాట, బస్తర్ బ్యాండ్, తోడా డ్యాన్స్, గోండ్ ట్రైబల్ డ్యాన్స్, డప్పు వాయిద్యాల డ్యాన్స్, ఆదివాసీ యువత చేసిన తీన్‌మార్, కొమ్ముకాయి, సవర, జాతపు, మణిపూర్ డ్యాన్స్, తప్పెటగుళ్ల నృత్యాలు అలరించాయి. తొలి రోజు 5 వేల మంది వరకు ఇతర ప్రాంతాల నుంచి సందర్శకులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ ఉత్సవ్ ఈ నెల 2వ తేదీ వరకు కొనసాగుతుంది.

హాట్ ఎయిర్ బెలూన్.. పారా గ్లైడింగ్

ఉత్సవ్‌లో భాగంగా పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన హాట్ ఎయిర్ బెలూన్, మాడగడ వ్యూ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన పారా గ్లైడింగ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హాట్ ఎయిర్ బెలూన్‌కు ఒకరికి రూ.1,800 చొప్పున టికెట్ ధర నిర్ణయించారు. హెలికాప్టర్‌లో గగనతలం నుంచి మన్యం అందాలను వీక్షించారు. పర్యాటకులెవరికీ పారా గ్లైడింగ్ చేసేందుకు అవకాశం ఇవ్వలేదు.

ఐఏఎస్, ఐపీఎస్‌లు స్టెప్‌లు..

సాయంత్రం ట్రైబల్ మ్యూజియంలో ఐఏఎస్, ఐపీఎస్‌లు డ్యాన్స్‌లు వేశారు. కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ అభిషేక్ గౌడ, ఐటీడీఏ పీవో అభిషేక్, అడిషనల్ ఎస్పీ ధీరజ్, మహిళా అధికారులు వస్త్రాలను తలపాగాలు కట్టుకుని వివిధ సినీ గీతాలకు డ్యాన్స్‌లు వేశారు.

తొలిసారిగా హెలికాప్టర్ రైడ్

తొలిసారిగా ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులోకి తెచ్చిన హెలికాప్టర్ రైడ్ పర్యాటకులకు తెగ నచ్చేసింది. 150 మంది వరకు సందర్శకులు తొలిరోజు హెలికాప్టర్ ఎక్కారు. ధర ఎక్కువైనా పర్యాటకులు తగ్గేదే లేదంటూ రైడింగ్‌కు ఆసక్తి చూపారు.

అలరించిన ఫ్లవర్ షో

పద్మాపురం గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ఫ్లవర్ షో ఆకర్షించింది. ఐటీడీఏ, హార్టికల్చర్ సంయుక్తంగా ఈ షోను ఏర్పాటు చేశాయి. కడియం, విశాఖపట్నం నుంచి 10 వేలకు పైగా పెద్ద చామంతులు, 5 వేలకు పైగా గులాబీలు, ఏజెన్సీ వాతావరణానికి అనుకూలంగా ఉన్న ఆర్కిడ్స్, బంతి, జరబరాలు పువ్వులు ప్రత్యేకంగా తీసుకువచ్చారు.

ఆకట్టుకున్న 25 రకాల స్టాళ్లు..

ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన 25 రకాల స్టాళ్లు పర్యాటకులను ఆకట్టుకున్నాయి. ఆదివాసీలు పండించే వివిధ రకాల ఉత్పత్తులు, గిరిజన సంప్రదాయ వస్తువులు, జీసీసీ ఉత్పత్తులు, చిరు ధాన్యాలను ప్రదర్శించారు. గిరిజనుల సంస్కృతిని తెలియజేసేలా పూరిగుడిసె సెట్ విశేషంగా ఆకట్టుకుంది.

ఆహా.. ఏమి రుచి : ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలతో తయారు చేసిన వంటకాలు సందర్శకులకు తెగ నచ్చేశాయి. రాగి బెల్లం పిట్టు, కందుల పిట్టు, అలసందల కిచిడీ, రాగి తోప, రాగి అంబలి, రాగి బెల్లం ఉండలు, సామ బియ్యం అన్నం, రాజ్‌మా కూర, వెదుర కొమ్ముల కూర, శంకర లడ్డూ, రాగి కుడుము, రాగి సక్కు, కర్ర పెండలం దుంపలు, రాజ్‌మా పిక్కలతో చేసిన రాబా, సారాకుల కూరతో రాబా, నాగలి దుంప, మరుగు చారు, కొర్రల బియ్యం పాయసం, చిలగడ దుంపలు, గుమ్మడి ఆకుల కూర, పిండి దుంపల కూర, అద్ద పిక్కలు, హల్వా ఆహా అనిపించాయి.


అలరించిన ఫ్లవర్ షో


గిరిజన సంప్రదాయ ఇంటి సెట్


వెజ్ డాగ్


అలరిస్తున్న హాస్యనటులు నవీన్, తాగుబోతు రాజమౌళి


నీలినీలి ఆకాశం పాట పాడుతున్న పీవో అభిషేక్, ఎంఎం శ్రీలేఖ


పూసలు కొనుగోలు చేస్తున్న గిరిజన విద్యార్థులు

ఐఐఎంవీలో నేటి నుంచి పరివర్తనాత్మక ఈ–సమ్మిట్

తగరపువలస: ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ ఇంక్యుబేషన్ సెంటర్‌లో శనివారం నుంచి పరివర్తనాత్మక ఇ–సమ్మిట్ నిర్వహించనున్నారు. ఎండ్యూరెన్స్ క్యాపిటల్‌కు చెందిన సిద్ధార్థ సిరిగేరి, కంట్రీడిలైట్‌కు చెందిన చక్రధర్ గాదె, ఫ్యాబ్ మార్ట్ వ్యవస్థాపకుడు కె.వైతీశ్వరన్‌ల ప్రారంభ ఉపన్యాసంతో ఉదయం 9 గంటలకు సమ్మిట్ ప్రారంభం కానుంది. అనంతరం పీర్ క్యాపిటల్‌కు చెందిన కార్తీక్ ప్రభాకర్, టాక్సీ ఫోర్‌ష్యూర్‌కు చెందిన అప్రమేయ రాధాకృష్ణ, సూనీ కార్న్ వెంచర్స్‌కు చెందిన విజయ్‌సింగ్ రాథోడ్ వంటి ప్రముఖులతో ప్యానెల్ చర్చలు జరగనున్నాయి. ఏపీవాల్ట్ 2.0లో ఈవెంట్ ముగియనుంది. హై స్టేక్స్ స్టార్టప్ పిచ్ పోటీ, ఫండింగ్, ఇంక్యుబేషన్ అవకాశాలను పొందేందుకు అభివృద్ధి చెందుతున్న స్టార్టప్‌ల కోసం ఈ వేదిక దోహదపడుతుందని నిర్వాహకులు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం అవసరం

విశాఖ–లీగల్: వివిధ న్యాయస్థానాల్లో పెండింగ్ కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో ఉపకరిస్తుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని శిక్షణ కేంద్రంలో న్యాయమూర్తులు, న్యాయవాదులకు జరుగుతున్న మధ్యవర్తిత్వ శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ న్యాయస్థానాల్లో లెక్కకు మించి పేరుకుపోతున్న కేసుల పరిష్కారానికి మధ్యవర్తిత్వం ఎంతో మేలు చేస్తుందన్నారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న న్యాయమూర్తులకు, న్యాయవాదులకు ప్రత్యేక ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో జాతీయ మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు సత్యారావు, రత్నతార, విశ్రాంతి న్యాయమూర్తులు, న్యాయవాదులు, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ పాల్గొన్నారు.

పరీక్షా కాలం

- నేడు ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష
- 3న ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష
- 5 నుంచి ప్రాక్టికల్స్, మార్చి 1 నుంచి వార్షిక పరీక్షలు

ఫస్టియర్	42,230
సెకండ్ ఇయర్	40,622
మొత్తం విద్యార్థులు	82,852

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. జిల్లాలోని గుర్తింపు పొందిన కళాశాలలన్నింటిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరిగే ఈ పరీక్షకు ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదివే 42,230 మంది హాజరుకానున్నారు. ఫిబ్రవరి 3న ఎన్విరాన్‌మెంటల్ పరీక్ష జరగనుంది. వార్షిక పరీక్షలకు జిల్లాలోని అన్ని కళాశాలల నిర్వాహకులను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు అప్రమత్తం చేశారు. విద్యార్థులకు మానవీయ విలువలు, పర్యావరణ విద్య వంటి అంశాల్లో అవగాహన ఎంత ఉందనేది పరిశీలన చేసే క్రమంలో వార్షిక పరీక్షలకు ముందు వీటిని నిర్వహిస్తున్నారు. విద్యార్థులంతా తప్పనిసరిగా ఈ పరీక్షలు రాయాలని ఇంటర్ బోర్డు అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

కేంద్రాలకు చేరిన సామగ్రి

పరీక్షల నిర్వహణకు అవసరమైన సామగ్రి ఇప్పటికే జిల్లాలోని అన్ని కళాశాలలకు సరఫరా చేశారు. పరీక్ష ప్రారంభ సమయానికి పావుగంట ముందు ఆయా కాలేజీల ప్రిన్సిపాళ్ల మెయిల్స్‌కు ప్రశ్నాపత్రంను నేరుగా ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు పంపించేలా ఏర్పాట్లు చేశారు. ప్రిన్సిపాల్ సెల్‌ఫోన్‌కు వచ్చే ఓటీపీ ద్వారా ప్రశ్నాపత్రాలను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలను నిర్వహించేలా సర్వం సిద్ధం చేశారు.

నిఘా నీడలో ప్రయోగ పరీక్షలు

ప్రాక్టికల్ పరీక్షలు ప్రాధాన్యం దృష్ట్యా ఎంపిక చేసిన కేంద్రాలన్నింటిలోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్నంత సేపు కేంద్రాల్లో జరిగే ప్రతి కదలికను నిశితంగా పరిశీలించేలా సీసీ కెమెరాల లైవ్ కొనసాగేలా సాంకేతికతను వినియోగిస్తున్నారు. వీటిని ఆర్ఐవో కార్యాలయంతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు కేంద్ర కార్యాలయం నుంచి కూడా పరిశీలన చేయనున్నారు. కాగా మార్చి 1 నుంచి వార్షిక(థియరీ) పరీక్షలు ప్రారంభంకానున్నాయి. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో గుర్తింపు ఉన్న 188 కాలేజీల్లో విద్యనభ్యసిస్తున్న మొదటి, రెండో సంవత్సరం కలిపి 82,852 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

ఫిబ్రవరి 5 నుంచి ప్రాక్టికల్స్

ఫిబ్రవరి 5 నుంచి ఇంటర్మీడియట్ ఒకేషనల్ విద్యార్థులకు, 10 నుంచి జనరల్ కోర్సు విద్యార్థులకు ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు రెండు సెషన్స్‌లో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలకు ఎంపీసీ విద్యార్థులు 34,645 మంది, బైపీసీ నుంచి 4,884 మంది హాజరుకానున్నారు. అదే విధంగా ఒకేషనల్ కోర్సుల నుంచి ఫస్టియర్ 1,651 మంది, సెకండ్ ఇయర్ 1,520 మంది హాజరుకానున్నారు. ప్రాక్టికల్ పరీక్ష కోసం ప్రయోగశాలలు అందుబాటులో ఉన్న 150 కాలేజీల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు.


పరీక్షలకు సిద్ధమవుతున్న గోపాలపట్నం ప్లస్ టూ స్కూల్ విద్యార్థినులు

పక్కాగా పర్యవేక్షణ



ఎథిక్స్, ఎన్విరాన్‌మెంటల్ పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాం. పరీక్షల నిర్వహణలో కాలేజీల ప్రిన్సిపాల్స్ తగిన బాధ్యత తీసుకోవాలి. ఎలాంటి పొరపాట్లు జరిగినా ఉపేక్షించేది లేదు. ఈ నెల 5 నుంచి ప్రారంభయ్యే ప్రాక్టికల్స్ పరీక్షలకు కాలేజీల్లో అంతా సిద్ధం చేసుకోవాలి.

– పి.మురళీధర్, ఆర్ఐవో, విశాఖ జిల్లా

రేపు ఒడిశాకు అప్పన్న ప్రచార రథం

సింహాచలం: సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి దేవస్థానానికి చెందిన ప్రచార రథం ఈ నెల 2 నుంచి 6వ తేదీ వరకు ఒడిశా రాష్ట్రంలో పర్యటించనుందని ఈవో వి.త్రినాథరావు శుక్రవారం తెలిపారు. ఏటా సింహగిరిపై మూడు నెలల పాటు ఉండి స్వామికి సేవలందిస్తున్న ఒడిశాలోని పట్టుపురానికి చెందిన లక్ష్మీకాంత్ నాయక్‌దాస్ ఆధ్వర్యంలో పలు చోట్ల స్వామి కల్యాణోత్సవాలు జరగనున్నాయని వివరించారు. ఈ నెల 2న మధ్యాహ్నం సింహాచలం నుంచి ప్రచార రథం ఒడిశా బయలు దేరుతుందన్నారు. బరంపురం సమీపంలోని పట్టుపురంలో 3న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీ నృసింహహోమం, సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు స్వామి కల్యాణోత్సవం జరుగుతుందన్నారు. పద్మనాభపురంలో 4న ఉదయం 9 గంటల నుంచి శ్రీనృసింహ హోమం, సాయంత్రం 5 గంటల నుంచి కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. విష్ణుచక్రపురంలో 5న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటకు, అదే రోజు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హుండీఘర్‌లో కల్యాణోత్సవాలు నిర్వహిస్తామని వెల్లడించారు. 6న ఉదయం 10 గంటల నుంచి చికిడీలో కల్యాణోత్సవం నిర్వహించిన అనంతరం, మధ్యాహ్నం 2 గంటలకు ప్రచార రథం సింహాచలం బయలుదేరుతుందని వివరించారు. రథంతో పాటు దేవస్థానం ఉద్యోగులు, వైదికులు తరలివెళ్లనున్నారు.

కుమారుడిని అప్పగించండి

ఓ తల్లి వినూత్న నిరసన


యామినితో చర్చిస్తున్న భీమిలి సీఐ సుధాకర్

తగరపువలస: అత్తింటి వారి నుంచి తమ కుమారుడిని అప్పగించాలని ఓ తల్లి వినూత్నంగా నిరసన చేపట్టింది. భీమిలి మండలం టి.నగరపాలెంలో పుట్టింటి వద్ద ఉంటున్న అక్కరమాని యామిని.. సంగివలసలోని తన అత్తింటివారి నుంచి కుమారుడిని అప్పగించాలన్న డిమాండ్‌తో శుక్రవారం హైవేపై రాస్తారోకో ద్వారా నిరసన తెలిపింది. ఆమెకు గ్రామస్తులు సంఘీభావం ప్రకటించారు. దీంతో హైవేపై భారీగా వాహన శ్రేణి నిలిచిపోయింది. నెల్లూరు నుంచి 40 ఏళ్ల కిందట నగరపాలేనికి వచ్చేసిన ఇటుకల వ్యాపారి బొట్ట శ్రీనివాసరావు తన కుమార్తె యామినిని రెండో వార్డుకు చెందిన అక్కరమాని చంద్రశేఖర్‌కు ఇచ్చి వివాహం చేశాడు. తర్వాత కాలంలో ఇరు కుటుంబాల మధ్య మనస్పర్థల కారణంగా ఏడాదిన్నరగా యామిని పుట్టింట్లోనే ఉంటుంది. ఈ క్రమంలో యామిని వద్ద నుంచి ఆమె భర్త చంద్రశేఖర్ కుమారుడిని తీసుకుని వెళ్లిపోయాడు. దీనిపై తన కుమార్తె యామినికి అన్యాయం జరిగిందని డీలా పడ్డ శ్రీనివాసరావు తీవ్ర మనస్తాపానికి గురై గతేడాది డిసెంబర్ 25న నెల్లూరు జిల్లా కలిగిరి మండలం తూర్పు దూబగుంటలో నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. అదే నెల 27న శ్రీనివాసరావు మృతదేహాన్ని నగరపాలెం తీసుకువచ్చి దహన సంస్కారాలకు ముందు సంగివలసలోని యామిని అత్తింటి వారి ముందు ఆందోళనకు ఉపక్రమించారు. దీంతో యామినికి నాలుగు రోజుల్లో బిడ్డను అప్పగిస్తామని ఏసీపీ అప్పలరాజు సమక్షంలో పెద్దలు, కుటుంబ సభ్యులు అంగీకారపత్రం ఇచ్చారు. ఇది జరిగి నెల రోజులు దాటుతున్నా బిడ్డను అప్పగించకపోవడంతో పాటు అత్తింటి వారికి బెయిల్ మంజూరు కావడంతో శుక్రవారం ఆమె హైవేను స్తంభింపజేశారు. సమాచారం అందుకున్న భీమిలి, ఆనందపురం సీఐలు బి.సుధాకర్, సీహెచ్ వాసునాయుడు సిబ్బందితో వచ్చి యామిని,గ్రామస్తులతో చర్చలు జరిపారు. అనంతరం ఆమెను ఏసీపీ దగ్గరకు తీసుకెళ్లడంతో రాస్తారోకో విరమించారు.

జాతీయస్థాయిలో విశాఖ కీర్తిని చాటండి

వెటరన్ క్రీడాకారులకు పిలుపు


వెటరన్ క్రీడాకారులకు ట్రాక్‌సూట్‌లు, నగదు బహుమతులు అందిస్తున్న కమల్‌బైద్ తదితరులు

మురళీనగర్: రాష్ట్ర స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ పోటీల్లో విశేష ప్రతిభ చాటిన విశాఖ క్రీడాకారులు జాతీయ స్థాయిలోనూ సత్తా చాటాలని వాకర్స్ ఇంటర్నేషనల్ పీఆర్వో కమల్ బైద్ ఆకాంక్షించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించి విశాఖ చేరుకున్న క్రీడాకారుల అభినందన సభ శుక్రవారం మురళీనగర్ వనితా భవన్‌లో జరిగింది. విశాఖ వెటరన్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 6, 7, 8 తేదీల్లో రాజస్థాన్‌లో జరగనున్న 'మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2025'లో ప్రతిభను చాటి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించాలన్నారు. గుడివాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్ర స్థాయి వెటరన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విశాఖ వెటరన్ అసోసియేషన్ నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొని 82 పతకాలు సాధించడం గర్వకారణమన్నారు. జనకులం ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ చింతలపాటి సత్యదేవ్ మాట్లాడుతూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలను సాధించిన అథ్లెట్స్‌కు 'మాస్టర్ ఈకే' పేరు మీద ఆర్థిక సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 33 మంది అథ్లెట్స్‌కు రూ 2,500 చొప్పున నగదును కమల్ బైద్, మహావీర్ ఇంటర్నేషనల్ ఏపీ, ఒడిశా జోన్ చైర్మన్ శుభోద్ కుమార్ అందించారు. క్రీడాకారులందరికీ స్పోర్ట్స్‌కిట్స్, ట్రాక్ సూట్‌లను చింతలపాటి సత్యదేవ్, సీహెచ్ శ్రీనివాసరాజు అందజేశారు. అసోసియేషన్ సెక్రటరీ జనరల్ మంగ వరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కార్యదర్శి ఎల్ వి. సుధాకర్, కోశాధికారి ఎం.రామారావు, పూర్వ అడిషనల్ కమిషనర్ డి.వి.ఎస్.భాస్కరరాజు, వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్మన్ వంశీ చింతలపాటి పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో, వరకట్నం కేసులు

ఎంవీపీకాలనీ: బాలికపై లైంగికదాడి, పెళ్లి, అనంతరం వరకట్నం కోసం వేధింపులకు దిగిన యువకుడిపై ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేశారు. తొలుత శ్రీకాకుళం జిల్లా పొందూరు స్టేషన్‌లో జీరో ఎఫ్ఐఆర్‌గా ఈ కేసు నమోదు కాగా.. ప్రస్తుతం ఎంవీపీ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించి ఎంవీపీ పోలీసులు తెలిపిన వివరాలివీ.. శ్రీకాకుళం జిల్లా పొందూరు మండలం, లొలుగు గ్రామానికి చెందిన బాలిక 2023లో ఇసుకతోట ఖుషీ బార్ వెనుక వీధిలో నివాసం ఉండేది. అదే ప్రాంతంలో ఉంటున్న విజయనగరం జిల్లా గంట్యాడ మండలం నీలావతి గ్రామానికి చెందిన శివ(21) బాలికతో పరిచయం పెంచుకున్నాడు. ఆమెతో సన్నిహితంగా ఉంటూ శారీరకంగా లోబరుచుకున్నాడు. ఈ విషయం పెద్దలకు తెలియడంతో ఆ అమ్మాయి మేజర్ అయిన అనంతరం వారిద్దరికి వివాహం జరిపించారు. అయితే ప్రస్తుతం శివ, అతని కుటుంబ సభ్యులు వరకట్నం కోసం తనను వేధిస్తున్నారని ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అతనిపై పోక్సో, వరకట్నం, ఇతర చట్టాల కింద కేసులు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్ నర్సు పోస్టుల భర్తీకి బ్రేక్

మహారాణిపేట: స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి బ్రేక్ పడింది. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఈ పోస్టుల భర్తీ వాయిదా పడింది. ఉత్తరాంధ్ర పరిధిలో వైద్య ఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న మొత్తం 106 పోస్టుల కోసం 8,300 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిశీలించి గత నెల 27న అభ్యర్థుల ప్రావిజనల్ జాబితాను వైద్య ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి విడుదల చేశారు. ఈ జాబితాను https://nagendrasvst. wordpress. com/ లో పొందుపరిచి, మూడు రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించారు. ఇంతలో ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. దీంతో గత 29 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈ క్రమంలో పోస్టుల భర్తీ ప్రక్రియ నిలిచింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి అయిన తర్వాత మళ్లీ స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేస్తామని రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రాధారాణి తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

LEASE / RENT
(35x85) Doctors Chambers / Medical Shop
D.No. 30-1-6/1, Good Hope Health Clinics, Near R.R.Grand Hotel, South Jail Road, Visakhapatnam -530020
94406 10036
91540 98165

DOCUMENT MISSING
I, VANGALAPUDI VENKATA LAKSHMI W/o. Tata Rao (Late) Resident of D.No. 19-15-3A, Poorna Market, A.V.N.College Down, Visakhapatnam. I lost the Original Document No. 6738/21, S.No. 1564. while travelling Jagadamba to Poorna Market on Dt. 21-01-2025 if any one found Please Contact : 92485 15924

OLD AGE HOME
Elder Home గాజువాక & అక్కయ్యపాలెం వృద్ధుల ఆశ్రమం. వృద్ధులకు మంచాన వున్న వారికి మంచి వాతావరణం, ఆరోగ్యకరమైన భోజనం 24 గం॥ వైద్యసేవలు. హోమ్‌కేర్ సర్వీస్ కలదు. ఫోన్ : 87904 49799, 90103 92178 [SCA25001472]

Real Estate

PLOT FOR SALE
గాజువాకకు 14 కి॥మీ॥, దేశపాత్రునిపాలెంకు 3 కి॥మీ॥ దూరంలో పంచాయతీ ప్లాట్స్, అగ్రికల్చర్ ఫామ్ ల్యాండ్ ప్లాట్స్ కలవు. Sq. 2500/- జీవీఎంసీ లిమిట్స్, అతి తక్కువ ధరలు కలవు. సెల్: 91542 33332 [V- 13198]

చీమలాపల్లి గ్రామం, శేషాద్రినగర్ నందు 25x40 (3), 111 చ॥గ॥ ఖాళీ స్థలం, అందలి ఇల్లు నిర్మించి ఇవ్వబడును. డైరెక్ట్ పార్టీస్ మాత్రమే సంప్రదించగలరు. ఫోన్ : 96182 90374 [V- 13260]

Wanted

Wanted Exp. (2 yrs) Xerox & DTP Operators - F/P Time (Fast Typing) both Telugu & English, Photoshop, Online works. Sal: 18000/-+Bus Pass. Cont: 90109 11112. [V- 2056]

హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్‌లో వృద్ధులను, పేషెంట్లను, పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K. Ph: 9640258899, 9640468899 [HA-1397]

TO-LET COMMERCIAL
Rent or Lease for Office / Clinic etc. purpose 1644 Sft. N/F, Pearl Enclave on Highway near Isukathota Jn. Ph : 91217 30309, 77319 69798 [V- 13245]

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

Services

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

BUSINESS OFFER
మేము మీ వ్యాపారాన్ని అభివృద్ధి చేయడానికి పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నాము. అలాగే ఏజెంట్లను కూడా ఆహ్వానిస్తున్నాము. 9092692403 [IA-0151]

GOLD LOANS
లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 13197]

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం